మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతి

- ఏడుగురికి గాయాలు

కొత్తగూడెం క్రైం, జూన్ 23 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో భద్రతాదళాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఆదివారం ఇద్దరు జవాన్లు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు. ఆ వివరాలను కొంట ఏఎస్పీ ఆకాశ్‌రావు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మ జిల్లాలో భద్రతాదళాలు యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌కు వెళ్లి, అది ముగించుకుని తమ వాహనంలో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో జగర్‌గుండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేకులగూడెం వద్దకు రాగానే మందుపాతర భారీ విస్ఫోటనం చెందింది. ఈ ఘటనలో జవాన్లు విష్ణు, శైలేందర్ మృతిచెందారు. ఏడుగురు జవాన్లు గాయపడ్డారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఘటన జరిగిన ప్రాంతంలో భద్రతాదళాలు భారీగా మోహరించి గాలింపుచర్యలు ముమ్మరం చేశాయి.

మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు లొంగుబాటు!

- మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సమక్షంలో లొంగిపోయినదంపతులు

కొత్తగూడెం క్రైం, జూన్ 23 : మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మోస్ట్ వాంటెడ్ నాయకుడు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, పోలీస్ అధికారుల సమక్షంలో ఆదివారం లొంగిపోయాడు. దీంతో మహారాష్ట్రంలో మావోయిస్టులు పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. గడ్చిరోలి జిల్లా మావోయిస్టు ఉద్యమ ఇన్‌చార్జి గిరిధర్ తుమ్రెట్టి అలియాస్ బిచ్చు తన భార్య సంగీత అలియాస్ లలితతోపాటు లొంగిపోయాడు. గిరిధర్ ఆ ప్రాంతంలో జరిగిన 86 ఎన్‌కౌంటర్లు, 15 కాల్పుల ఘటనల్లో క్రియాశీలక పాత్ర పోషించాడు. బిచ్చుపై ఇప్పటికే ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల రివార్డును ప్రకటించింది. అనేక చట్టవిరుద్ధ ఘటనల్లో పాల్గొన్న గిరిధర్‌పై ఇప్పటివరకు 176 కేసులు నమోదయ్యాయి. 1996 నుంచి 2024 సంవత్సరం వరకు గిరిధర్ అలియాస్ బిచ్చు వివిధ హోదాల్లో అనేక ఘటనల్లో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించాడు. ప్రస్తుతం ఆ పార్టీ యాక్టీవ్ మెంబర్‌గా ఉన్న బిచ్చు లొంగుబాటు మావోయిస్టు పార్టీకి నష్టాన్ని కల్పించింది.

పశువుల కొట్టం కాదిది.. రేషన్ షాపే..

ఈ చిత్రాన్ని చూడగానే ఇదేదో పశువుల కొట్టమేమోనని పొరబడుతున్నారా? అయితే మీ పొరపాటు నిజంగా పొరపాటే. ఎందుకంటే ఇది పశువుల కొట్టం కానే కాదు. సాక్షాత్తూ జీసీసీ దుకాణం. ఆ పక్కనే నిర్మాణంలో ఉన్న పక్కాగా పంచాయతీ కార్యాలయం భవనం. మరి ఈ భవనాలు ముందు ఈ పశువులు ఏమిటి? ఈ మురుగు గుంతలేమిటి? అని సందేహిస్తున్నారా? అయితే చదవండి.. అసలు కమామీషు ఏమిటో.. ఈ చిత్రంలో కన్పిస్తున్న రెండు భవనాలు చండ్రుగొండ మండలం పోకలగూడెం గ్రామంలోనివి. వీటిల్లో తెలుపు రంగులో ఉన్న భవనం గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కి చెందిన రేషన్ షాపు. ఆ పక్కనే నిర్మాణంలో ఉన్నది గ్రామ పంచాయతీ భవనం. అయితే ఈ రేషన్‌షాపులో ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఇక్కడి ప్రజలు రేషన్ సరుకులు తీసుకెళ్తుంటారు. ఆ తరువాత 15 రోజులూ అది మూతపడ ఉంటుంది. అయితే ఆ రేషన్‌షాపు ఎదుట పెద్ద గుంత ఉండడంతో దాంటో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ఆ షాపు పనిదినాల్లో వినియోగదారులు వచ్చిపోయేందుకు వీలు పడని విధంగా ఉంటోంది. ప్రతి నెలా 15వ తేదీ తరువాత అక్కడి ఇరుగుపొరుగు ప్రజలు తమ పశువులను ఈ భవనాల ఎదుట కట్టేస్తున్నారు. కొందరైతే నిర్మాణంలో ఉన్న పంచాయతీ కార్యాలయంలోనే కట్టేస్తున్నారు. అప్పటి మురుగు గుంత ఉండడం, దానికి తోడు పశువుల అలిడికి తోడు కావడం వంటి కారణాలతో ఆ ప్రాంగణమంతా చిత్తడిగా మారుతోంది. అసలే వర్షాలు పడుతున్న కురుస్తున్న తరుణంలో ఈ చిత్తడి, దుర్గంధం వల్ల సీజనల్ వ్యాధులు ప్రమాదం లేకపోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. - చండ్రుగొండ, జూన్ 23

ఈ నెల 16న రేషన్‌షాపు, పంచాయతీ భవనం ఎదుట చేరిన బురద

తాజాగా అదే రేషన్‌షాపు, పంచాయతీ భవనం ఎదుట ఉన్న బురద; భవనాల్లో ఉన్న పశువులు

మావోయిస్టుల స్థావరంలో దొంగనోట్ల ముద్రణ!

- జాయింట్ ఆపరేషన్స్‌లో దొరికిన ప్రింటింగ్ మెషీన్లు
- నోట్ల తయారీ సామగ్రితోపాటు ఆయుధాలు స్వాధీనం

కొత్తగూడెం క్రైం, జూన్ 23 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో భద్రతాదళాల జాయింట్ ఆపరేషన్స్‌లో భాగంగా ఆదివారం మావోయిస్టుల స్థావరంలో ఆయుధాలతోపాటు దొంగనోట్ల ముద్రణ సామగ్రి దొరకడం సంచలనంగా మారింది. వివరాల్లోకెళ్తే.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో మావోయిస్టుల కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా భద్రతాదళాలు జాయింట్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కొరాజ్‌గూడ అడవుల్లో మావోయిస్టుల స్థావరంపై దాడులు చేయగా నకిలీనోట్ల పేపర్లతోపాటు, వాటి తయారీకి ఉపయోగించే యంత్రాలు(కలర్ జిరాక్స్, స్కానర్స్), ఇన్వర్టర్, క్యాట్రిడ్జులు, ద్రవ రసాయనాలు లభించాయి. వీటితోపాటు రెండు తుపాకులు, వాకీ టాకీలు, విప్లవ సాహిత్యాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎన్నడూ లేనివిధంగా మావోయిస్టులు నకిలీనోట్ల ముద్రణకు పాల్పడడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టు స్థావరంలో లభ్యమైన దొంగనోట్ల ముద్రణ యంత్ర సామగ్రి, ఆయుధాలు

మావోయిస్టుల స్థావరంలో లభ్యమైన నకిలీ నోట్లు

మళ్లీ యథేచ్ఛగా పోడు

- అడవిలో జోరుగా భారీ వృక్షాల కూల్చివేతలు
- యంత్రాలతో చదును చేసి సాగుకు యత్నం
- 'హస్తం' నేతల హస్తం.. అధికారుల మౌనం!

పోడు భూములను చదువు చేస్తున్న డోజర్ (ఫైల్)

రావికంపాడులో ఇటీవల పోడు భూముల్లో కాల్చిన పెద్ద వేప చెట్టు (ఫైల్)

చండ్రుగొండ, జూన్ 23: చండ్రుగొండ మండలంలో మళ్లీ పోడు వ్యవహారం ఊపందుకుంది. పోడు భూముల సాగు పేరుతో అడవుల ధ్వంసాలు, భారీ వృక్షాల నరికివేతలు కొనసాగుతున్నాయి. అయితే, 'ఇప్పటి వరకూ సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేస్తున్నాం. మళ్లీ పోడు పేరుతో ఇకపై కొత్తగా అడవులు నరకవద్దు. ఆ బాధ్యతను గిరిజనులు, ఆదివాసీలే తీసుకోవాలి. అడవులను కాపాడుకోవాలి' అంటూ గతంలో పోడు పట్టాల పంపిణీ సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనులను విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. కానీ, ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ఆ పార్టీ నేతలు కొందరికి సహకరిస్తుండడం, అందుకు అటవీ శాఖలోని కొందరు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం వంటి కారణాలతోక పోడు వ్యవహారం మళ్లీ జోరందుకుంది.

పట్టపగలే భారీ వృక్షాల నరికివేతలు..

మండలంలో ప్రధానంగా పోకలగూడెం, రావికంపాడు, మద్దుకూరు గ్రామాల శివార్లలోని అటవీ ప్రాంతాల్లో అధికశాతం మంది గిరిజనులు, కొద్దిమంది గిరిజనేతరులు పోడు పేరుతో కొత్తగా అడవులను నరుకుతున్నారు. పట్టపగలే భారీ వృక్షాలను కూల్చుతున్నారు. అవి ఎండిన తరువాత వాటిని కాల్చివేస్తున్నారు. పోకలగూడెం, వెంకటియాతండా పంచాయతీల్లోని అటవీ ప్రాంతంలో ట్రాక్టర్లు, డోజర్ల సహాయంతో పట్టపగలే అడవిని చదును చేస్తున్నారు. అయితే ఇదంగా అటవీశాఖలో కొందరు సిబ్బంది, అధికారులకు తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. పగటి వేళలో పెద్ద పెద్ద వేప చెట్లను నరికినా, నిప్పు పెట్టినా ఆ శాఖ సిబ్బంది కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడం చర్చనీయాంశంగా మారింది. మద్దుకూరు శివారులోని అడవిలో కూడా ఇటీవల కొత్తగా పోడు నరికిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అయినా వాటిపై కనీసం కేసులు నమోదు కూడా చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేతల 'హస్తం'?

పోడు వ్యవహారంలో కొందరు అధికార నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అటవీ అధికారులు, సిబ్బంది కూడా మౌనంగా ఉన్నారని, పైగా మామూళ్ల వ్యవహారం కూడా ఉండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన పోడు భూముల్లో ఉన్న పెద్దపెద్ద వేప చెట్లను కూడా ఇటీవల కొందరు కాల్చిన ఘటనలు అనేకం ఉన్నాయి. అయితే వారిపై అధికారులు నామమాత్రపు చర్యలు కూడా తీసుకోక పోవడం గమనార్హం.

అడవులను ధ్వంసం చేస్తే చర్యలు..

రావికంపాడులో కొందరు మహిళలు మా మాట కూడా వినకుండా అడవులను నరుకుతున్నారు. కొత్తగా పోడు పేరుతో అడవులను ధ్వంసం చేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. గతంలో పోడు పట్టాలు పొందిన వారు సైతం మళ్లీ కొత్తగా అడవులను నరుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అటువంటి వారి పోడు పట్టాల రద్దు కోసం కలెక్టర్‌కు నివేదిస్తాం. అడవుల సంరక్షణ అందరి బాధ్యత. కొందరు పెద్ద వేప చెట్లను నరికిన విషయంపై విచారణ చేపట్టాం. వృక్షాలను నరికినట్లుగా ఆరోపణలు వచ్చిన వారిని ప్రశ్నించాం. తాము నరకలేదని వాళ్లు చెబుతున్నారు. వాస్తవాలు తెలుసుకుంటాం.

– ఎల్లయ్య, అటవీ శాఖ రేంజర్, చండ్రుగొండ

ఫోక్సో కేసు నమోదు

జూలూరుపాడు, జూన్ 23 : బాలికను వేధించిన యువకుడిపై పోలీసులు ఆదివారం ఫోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెడుతూ వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరెండర్ చేయవద్దు

జీవిత బీమాపై నిపుణులు ఏమంటున్నారో తెలుసా

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నవారు, అధిక మొత్తాల్లో ఉన్న ప్రీమియంలు చెల్లించలేకపోతున్నవారు, పాలసీ అనవసరంగా భావించినవారు.. తమ జీవిత బీమా పాలసీలను సరెండర్ చేస్తూంటారు. మరికొందరు అమ్ముతూ ఉంటారు. అయితే ఈ రెండింటిలో ఏది లాభం? నిపుణులు ఏం చెప్తున్నారు.

ఇదీ సంగతి..

మీ జీవిత బీమా పాలసీని సరెండర్ చేయడం కన్నా.. అమ్ముకుంటే ఎక్కువ మొత్తంలో నగదును పొందగలరని నిపుణులు సూచిస్తున్నారు. పాలసీని సరెండర్ చేయడం అంటే మీ కవరేజీని రద్దు చేసుకోవడమే. మీ పాలసీ పత్రాలను తిరిగి సదరు కంపెనీకే ఇచ్చేయాల్సి ఉంటుంది. ఇందుకుగాను మీకు ఆ బీమా పాలసీని అమ్మిన సంస్థ.. వెంటనే దాని సరెండర్ విలువను చెల్లిస్తుంది. సంస్థ నిర్ణయించినదే వస్తుంది. ఎలాంటి సంప్రదింపులకు ఆస్కారం లేదు. ఈ క్రమంలో ఏవైనా చార్జీలు పడితే వాటిని ఆ మొత్తం నుంచి మినహాయించుకుంటుంది కూడా. దీంతో మీకు తక్కువ నగదు మొత్తాలు రావచ్చు.



సెకండరీ మార్కెట్‌లో..

మీకు అనవసరంగా అనిపించిన లేదా మీరు భారంగా భావించిన మీ పాలసీని సరెండర్ చేయకుండా సెకండరీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి కూడా వీలున్నది. దీన్ని లైఫ్ ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌గా పిలుస్తారు. సరెండర్ చేస్తే మీకు త్వరితగతిన మీరు చెల్లించిన నగదు తిరిగి రావచ్చుగానీ.. అమ్ముకుంటే మాత్రం ఎక్కువ మొత్తంలో నగదును పొందే అవకాశం ఉంటుంది. ఇక అమ్ముకుంటే మీ పాలసీ ప్రీమియంలన్నీ కూడా దాన్ని కొన్నవారే చెల్లిస్తారు. అలాగే మీరు చనిపోయినప్పుడు మీ మరణానంతర ప్రయోజనాలన్నీ కూడా పాలసీని కొన్నవారికే అందుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పాలసీ యాజమాన్య హక్కులను మీరు అమ్ముకుంటున్నారన్నమాట.

జీవిత బీమా సరెండర్ చేస్తే..

అనుకూలతలు	ప్రతికూలతలు
✓ త్వరగా మీ పాలసీ నుంచి బయటపడుతారు	✗ సరెండర్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.
✓ మీరు మీ పెట్టుబడిలో కొంత మొత్తాన్ని తిరిగి పొందుతారు	✗ ఎలాంటి సంప్రదింపులకు తావుండదు

అమ్ముకుంటే

అనుకూలతలు	ప్రతికూలతలు
✓ మీ పాలసీకి మీరు మరింత సొమ్మును పొందవచ్చు	✗ సరైన కొనుగోలుదారుడిని వెతికేందుకు సమయం పట్టవచ్చు
✓ కొనేవారినిబట్టి రకరకాల ఆఫర్లు, సంప్రదింపులకు వీలుంటుంది	✗ లాయర్ లేదా ఇన్సూరెన్స్ బ్రోకర్ల సాయం తీసుకోవాల్సి రావచ్చు

ఎవరు కొంటారు?

సెకండరీ మార్కెట్‌లో జీవిత బీమా పాలసీల్లో తమ నగదును పెట్టుబడిగా పెట్టే ప్రైవేట్ ఇన్వెస్టర్లు కొంటారు. అలాగే ప్రైవేట్ సెల్లర్ల నుంచి జీవిత బీమా పాలసీలను కొనే లైఫ్ సెటిల్మెంట్ కంపెనీలుంటాయి. బ్రోకర్ల ద్వారా ఈ లావాదేవీలు జరుగుతాయి. ఇక బ్యాంకులు లేదా క్రెడిట్ యూనియన్ల వంటి ఇతర ఆర్థిక సంస్థలూ కొంటాయి. కాగా, వయస్సు, ఆరోగ్య పరిస్థితులనుబట్టి కూడా పాలసీలకు సెకండరీ మార్కెట్‌లో ధరలు పలుకుతాయి. అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుంటే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువ కాబట్టి అధిక మొత్తాల్లో చెల్లించి పాలసీలను కొనేందుకు బయ్యర్లు ముందుకొస్తారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. అలాగే తక్కువ మొత్తాల ప్రీమియంలతో కూడిన పాలసీలున్నా.. ఆకర్షణీయ ధర లభిస్తుంది. పాలసీ కున్న మరణానంతర ప్రయోజనాలనుబట్టి కూడా ధరలు పెరుగుతాయి. పాలసీ సెల్లర్లు సంప్రదింపుల ద్వారా కూడా తమ పాలసీ ధరల్ని పెంచుకోవచ్చు.

చివరగా..

పాలసీని సరెండర్ చేయడమో లేదా అమ్ముకోవడమో అనేది పాలసీదారులకు చిట్టచివరి మార్గంగా మాత్రమే ఉండాలి. ప్రతీ చిన్న అవసరం కోసం జీవిత బీమా పాలసీలను వదులుకోరాదు. అలాగే ఆర్థిక సలహాదారులను సంప్రదిస్తే మరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలనైనా వారు సూచించగలరు. అలా నిధుల అవసరాలను తీర్చుకోవచ్చేమోనని కూడా ప్రయత్నిస్తే మంచిది. దీనివల్ల కుటుంబానికి మేలు చేసినవారు అవుతారు. మీరు లేని సమయంలో మీ వాళ్లకు భరోసా ఒక్క బీమా మాత్రమేనన్నది మరువద్దు.

ఎదురయ్యే నష్టాలివే..

- జీవిత బీమాను సరెండర్ చేసినా, అమ్ముకున్నా మరణానంతర ప్రయోజనాలను కోల్పోతారు.
- ముఖ్యంగా మీ కుటుంబానికి అందే దీర్ఘకాలిక ఆర్థిక సుస్థిరత అవకాశాలు దూరమవుతాయి.
- అంతేగాక ఒక పాలసీని సరెండర్ చేస్తే.. మరొక పాలసీని తీసుకోవాలనుకున్నప్పుడు మీకు సమస్యలు ఎదురుకాగలవు.
- సరెండర్ చార్జీలతోపాటు మీరు అందుకునే నగదు మొత్తాలపైనా పన్నులు చెల్లించాల్సి రావచ్చు.
- తొందరపడి తీసుకునే నిర్ణయాలతో నష్ట తీవ్రత పెరుగవచ్చు.

ఇట్లుంటే తిప్పలు తప్పవు

ఆర్థిక ప్రగతిని సాధించాలంటే క్రమశిక్షణ ఎంత అవసరమో.. కొన్ని దురలవాట్లను దూరం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రధానంగా పెట్టుబడులు, పొదుపు, ఖర్చులు ఇలా పలు అంశాల్లో తెలివిగా వ్యవహరించాలి.

ఆలోచించకుండా తొందరపాటుతో స్టాక్ మార్కెట్లలో నేరుగా పెట్టుబడులకు దిగితే నష్టాలే. పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే ఇండివీడ్యువల్ స్టాక్స్‌ను కొనుగోలు చేయాలి. ఇక చిన్న మదుపరులు ఎట్టి పరిస్థితుల్లోనూ రిసెర్చ్ చేయకుండా మదుపు చేయరాదు. రిటైల్ ఇన్వెస్టర్లూ నిపుణులను సంప్రదించిగానీ స్టాక్స్ కొనుగోళ్లకు దిగవద్దు. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉంటే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ముందుకెళ్లవచ్చు.

అత్యవసర నిధిపై అశ్రద్ధ

అత్యవసర నిధిపై చాలామంది అశ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా నేటి యువతరం సరదాలు, సంతోషాలకే ప్రాధాన్యతనిస్తూ ఖర్చులకు తెగబడుతున్నారు. క్రెడిట్ కార్డులు, మొబైల్ వ్యాలెట్లు అంటూ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. అందుకే కొంత నగదు మొత్తాలతో ఎమర్జన్సీ ఫండ్‌ను సృష్టించుకోవాలని సలహా.

బీమాపై చిన్నచూపు

బీమాను చిన్నచూపుతో చూడవద్దు. అలాగే దీన్నో పన్ను ఆదా సాధనంగా పరిగణించవద్దు. పాలసీలను పన్ను కోణంలో చూసి కొంటే.. దాని ప్రయోజనాలు పూర్తిగా అందవు. కాబట్టి ఆపత్కాలంలో అన్నివిధాల అండగా ఉండే బీమానే ఎంచుకోవాలి.

మితిమీరిన రుణ భారం

ఆదాయం ఉన్నదికదా అని నేడు చాలా మంది ఎడాపెడా అప్పులు చేసేస్తున్నారు. క్రెడిట్ స్కోర్ బాగుందంటూ ఎవరు ఏ రకంగా లోన్ ఇస్తామన్నా వద్దనకుండా తీసేసుకుంటున్నారు. దీనివల్ల రుణ భారం పెరిగిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది.

ఆర్‌డీలను ఉపసంహరిస్తారా?

పోస్టాఫీస్ రూల్స్ ఏం చెప్తున్నాయ్

పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ)లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే.. దాని కాలపరిమితి ఐదేండ్లుంటుంది. అయితే ఈలోగా ఏదైనా అత్యవసరంగా నిధులు కావాల్సి వచ్చి సదరు ఆర్‌డీ ఖాతాను ఉపసంహరించుకోవాలంటే ఏం చేయాలి? నిబంధనలు ఎలా ఉంటాయి? వీటిని ఒక్కసారి పరిశీలిస్తే..

మూడేండ్ల తర్వాత..

తపాలా కార్యాలయ రికరింగ్ డిపాజిట్ ఖాతాలను.. మొదలుపెట్టిన మూడేండ్ల తర్వాత నిర్ణీత గడువు తీరకముందే ఉపసంహరించుకోవచ్చు. అంటే మూడేండ్లు పూర్తయితే ఐదేండ్లదాకా ఆగనవసరం లేదు. ఇక నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ రూల్స్ 2019 ప్రకారం ఫామ్-2లో అకౌంట్స్ ఆఫీస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీ ఆర్‌డీ ఖాతాను తెరిచిన పోస్టాఫీస్‌కే ఈ దరఖాస్తును 'ప్రీ మెచ్యూర్ క్లోజర్ ఆఫ్ అకౌంట్'గా అందివ్వాల్సి ఉంటుంది. అయితే అడ్వాన్స్ డిపాజిట్ చెల్లింపులుంటే వాటి కాలవ్యవధి ముగిసేదాకా ఆర్‌డీ ఖాతాను ముందస్తుగా మూసివేయలేం. కాగా, ఈ నెల 22న పోస్టాఫీస్ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన వివరాల ప్రకారం.. మెచ్యూరిటీకి ఒక్కరోజు ముందుగా ఖాతాను మూసేసినా దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటే వర్తిస్తుంది.

- ఖాతా తెరిచిన ఐదేండ్లదాకా ఆర్‌డీ నడుస్తూనే ఉంటుంది.
- మెచ్యూరిటీ తర్వాత కూడా సంబంధిత తపాలా కార్యాలయానికి దరఖాస్తు చేసుకొని మరో ఐదేండ్లు పొడిగించుకోవచ్చు.
- కాలవ్యవధిని పొడిగించుకున్న ఖాతాలను ఎప్పుడైనాసరే ఉపసంహరించుకోవచ్చు.
- పూర్తయిన సంవత్సరాలకు ఆర్‌డీ వడ్డీరేటే వర్తిస్తుంది. ఇంకా నెలల కాలం ఏదైనా మిగిలితే దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటును లెక్కించి చెల్లిస్తారు.
- నిర్ణీత కాలవ్యవధి వరకు నెలకు కనీసం రూ.10, ఆపై ఎంతైనా ఆర్‌డీల్లో పొదుపు చేసుకోవచ్చు. దీనికి ఫిక్స్‌డ్ వడ్డీరేటు వర్తిస్తుంది.

పెట్టుబడుల దిశగానే..

మార్కెట్ పల్స్

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు మెజారిటీ ట్రేడింగ్ సెషన్లలో లాభాలనే అందుకుని రికార్డు స్థాయిల్లో కదలాడాయి. అయితే ఆఖర్లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 217.13 పాయింట్లు పెరిగి 77వేల స్థాయికి ఎగువన 77,209.90 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 35.50 పాయింట్లు అందిపుచ్చుకుని 23,501.10 దగ్గర నిలిచింది. ఈ వారం సైతం సూచీలు ఓవరాల్‌గా లాభాల్లోనే కదలాడవచ్చన్న అంచనాలున్నాయి. లాభనష్టాల మధ్య కొట్టుమిట్టాడినా.. చివరకు ఓ మోస్తరు వృద్ధినే చూస్తాయన్న అభిప్రాయాలు ఎక్కువమంది నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, మదుపరులు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకునే వీలు కూడా లేకపోలేదంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,600-23,800 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా అంటున్నారు.